8. న్యాయంబు దీర్చు దినము గలదు – నమ్మని వారెల్ల – సాయంబు వెదకినను గనపడదు = సువార్త న్యాయముఁ దీర్చును – నడవడి చొప్పున – నమ్మని పాపుల – నరకము జేర్చును ॥యేసు॥

9. నమ్మండీ నష్టము నొందక – యేసుని నమ్మిన – పొమ్మని చెప్పఁడు సుమ్మండి = ఇమ్ముగఁ గృపతో – నిలలోఁ గాచును – పిమ్మట మోక్ష పురమునఁ జేర్చును ॥యేసు॥

– గొల్లపల్లి నతానియేలు

## 298 యేసునొద్దకు రండి

రా – మధ్యమావతి తా –ఆది

రండి యేసుని యొద్దకుఁ – ప్రియులారా మీరు – రండి యేసుని యొద్దకు = రండి రండి – రయమున బిలుచుచు – నుండెడి రక్షకుఁ – డొసఁగెను బ్రాణము ॥రండి॥

1. మీరు పాపంబులఁ ద్యజించి – యేసుని కడకు – రారే వేగము విశ్వసించి = మీరు వచ్చినను – మిమ్మును ద్రోయఁడు – చేరెడు వారిని – జేర్చును దన దరి ॥రండి॥

2. మీకు బ్రతుకేమి శాశ్వతము – ప్రియ జనులారా – పోకుఁడి యాశించి లోకమును = లోకాశలకును – లొంగుట చేతను – మీకు ఘటిల్లును – మెండగు దుఃఖము ॥రండి॥

3. మీరేల జాలము చేసెదరు – ప్రియులారా వేగ – రారే కడు భాగ్య మొందెదరు = చేర వచ్చి చిర – జీవము నొందుఁ డ – పార ముదంబును– బడయఁగ దేవుఁడు ॥రండి॥

– పులిపాక జగన్నాథము



## 299 యేసునాధ కథా మాధుర్యము

రా – బిలహరి తా – త్రిపుట

యేసు నాథ కథా [1]సుధా రస – మిదిగో పానముఁ జేయరే = దోసకారి జనంబులారా – దురిత భవముల బాయరే ॥యేసు॥

1. ఇహపరంబు లెవనిచే సృజి – యింపఁబడియెనొ చూడరే = అసహాయ యా విభుఁ డవతరించెను – అతని గుణములఁ బాడరే ॥యేసు॥

2. [2]దురిత భరితుల దుష్ట [3]చరితుల– నరయ వచ్చెను జూడరే=స్థిరముగామది నమ్మి యా ప్రభు – కరుణ మదిఁ గొనియాడరే ॥యేసు॥

3. పనికిమాలిన [4]వేలుపుల దెస – పరుగు లెత్తుట మానరే = [5]తనువు మీ కొఱ కిచ్చు క్రీస్తుని – దయకుఁ బాత్రతఁ బూనరే ॥యేసు॥

4. మరణ బలి రక్తమున మన యం –దఱిని బ్రోవను వచ్చెను = కరుణతోఁ బాపులఁ బిలుచు గురు – దరికిఁబోవుద మిచ్చను ॥యేసు॥

5. పరమతత్వ విధాన బోధలు – బాగుగఁ బ్రకటించెను = [6]చిరసుఖాస్పద పదముఁ గోరిన – జీవులకు వినిపించెను ॥యేసు॥

6. మరణ మొందిన కొందఱికిఁ దా – మరలఁ బ్రాణము లిచ్చెను = వర మహాద్భుత కార్యముల ని– ద్ధరననేక మొనర్చెను ॥యేసు॥

7. కుటిల బుద్ధుల ద్రోచి సజ్జన – గోష్ఠి నుండుట గోరరే = దిటముగను నెమ్మదిని మీరొం – దుటకుఁ క్రీస్తునిఁ జేరరే ॥యేసు॥

– పురుషోత్తము చౌదరి

[1]అమృతము [2]పాపములతో నిండియున్నవారిని. [3]దుర్మార్గమైన ప్రవర్తనగలవారిని [4]దేవతల [5]దేహము. [6]ఎల్లప్పటికిని సుఖకారణమైన